క్లుప్తంగా

వాహనాల వేలంలో రూ.6.26 లక్షల ఆదాయం

ఎమ్మిగనూరురూరల్: అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన 23 వాహనాలకు స్థానిక సెబ్ కార్యాలయం అవరణలో సోమవారం సీఐ జయరాం నాయుడు ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఒక కారు, మూడు ఆటోలు, 19 బైకులకు వేలం నిర్వహించగా అన్నీ అమ్ముడుపోయాయి. వాహనాలకు ప్రభుత్వ ధర రూ.2,14,000 కాగా వేలం ద్వారా రూ.6,26,500 లభించినట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఎమ్మిగనూరుటౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరిగే అండర్-14 రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు స్థానిక ఎంఎస్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. 8వ తరగతి విద్యార్థినులు మౌనిక, నిత్యసాయి, హారికలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని హెచ్ఎం గౌసియాబేగం, పీడీలు సుజనాకుమారి, నాగేశ్వరి సోమవారం తెలిపారు. క్రీడాకారిణులను అభినందించారు.

నేడు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఆలంకొండ గ్రామంలో దస్తగిరయ్య స్వామి ఉరుసు పురస్కరించుకుని మంగళవారం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గెలుపొందిన జట్లకు వరుసగా రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు చొప్పున అందించనున్నట్లు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే జట్లు ఉదయం 9 గంటల్లోపు రూ.400 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని వివరాలకు 7993760575, 9398034565 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

మద్దికెర: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ హేమలత సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ-కేవైసీ చేయించకపోతే ప్రభుత్వం అందించే రాయితీ విత్తనాలు, ఎరువులు, పావలా వడ్డీ రుణాలు మరిన్ని ప్రభుత్వ పథకాలకు అనర్హులవుతారన్నారు. రైతులు దగ్గరలోని ఆర్బీకేలో ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని సూచించారు.

తుగ్గలి: రబీలో పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ మండల అధికారి పవన్‌కుమార్ సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులతో ఈ-కేవైసీ చేయించారు. మండలంలో రబీ సీజన్‌లో 2,659 రైతులు 8,123 ఎకరాల్లో సాగుచేసిన పంటలు ఈ- క్రాప్ నమోదు చేశామన్నారు.

వేలం పాట వాయిదా

వెల్దుర్తి: స్థానిక పాతబస్టాండు సంత మార్కెట్‌లో పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని 13 దుకాణాల కేటాయింపునకు బహిరంగ వేలం జనవరి 31వ తేదీన నిర్వహించాల్సి ఉండగా వాయిదా వేసినట్లు ఈఓ జేమ్స్ కృపవరం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దుకాణాల వేలం ఫిబ్రవరి 4వ తేదీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సారా బట్టీ ధ్వంసం

వెల్దుర్తి: కోడుమూరు సెబ్ స్టేషన్ పరిధిలోని వెల్దుర్తి మండలం ఎల్ తండా కొండ ప్రాంతాలలో సారా బట్టీలపై సోమవారం సెబ్ అధికారులు, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన దాడులలో 510 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి, 25 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీదారులు ఎల్ తండా గ్రామానికి చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసి డోన్ కోర్టులో హాజరు పరచగా వారిని జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సర్వే వేగవంతం చేయండి

నందవరం: ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న సిటిజన్ అవుట్ రీచ్ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లను ఎంపీడీఓ కృష్ణమూర్తి ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలో పాటు నాగలదిన్నె, గురజాల, ముగతి, నదికై రవాడి, పెద్దకొత్తిలి, కనకవీడు తదితర గ్రామ సచివాలయాల్లో సిబ్బంది, వలంటీర్లు సర్వే చేపట్టారు. సర్వేపై ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో 19,886 మంది హౌస్ హోల్డర్స్ ఉన్నారని, ఇందులో 3,405 మందికి మాత్రమే సర్వే పూర్తి చేశారన్నారు. సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు నిబంధనలు పాటించండి

చిప్పగిరి: రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యం చేరుకోవాలని ఎస్ఐ మల్లికార్జున వాహనదారులకు సూచించారు. సోమవారం చిప్పగిరిలో ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగిఉండాలని, వాహనానికి సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. పెండింగ్ చలానాలు ఉంటే సత్వరమే చెల్లించాలని కోరారు. ఏఎస్ఐ నజీర్ అహమ్మద్ పోలీసులు పాల్గొన్నారు.

వాల్మీకుల వినతి

ఆలూరు: వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై విచారణ జరిపేందుకు నిర్వహించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ శామ్యూల్ ఆనంద్‌కు సోమవారం జెడ్పీ సమావేశ భవనంలో ఆలూరు వాల్మీకి కులస్తుల సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. వీఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు రాంభీమ్‌నాయుడు, కప్పట్రాళ్ల మల్లికార్జున, వరుణ్, బొగ్గల ఈరన్న తదితరులు వాల్మీకి కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి చేయాలని కోరారు.

కుల వృత్తులకు ‘చేదోడు’

- నాయీ బ్రాహ్మణులు, దర్జీ, రజకులకు రూ.10 వేల ఆర్థిక సాయం
- వరుసగా మూడో ఏడాది బ్యాంకు ఖాతాల్లో నగదు జమ
- ఆదోని, పత్తికొండ డివిజన్లలో 6,668 మందికి లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న కులవృత్తిదారులు



సెలూన్ షాపులో కటింగ్ చేస్తున్న నాయీబ్రాహ్మణుడు



పనిలో నిమగ్నమైన టైలర్

ఆలూరు రూరల్: ఏళ్ల తరబడి ఆదరణకు నోచుకొని కులవృత్తుల జీవితాల్లో వెలుగు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రజా సంకల్ప పాదయాత్రలో కుల వృత్తిదారులకు ఇచ్చిన హామీ మేరకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మూడో సారి నాయీ బ్రాహ్మణులు, దర్జీ, రజకులకు రూ.10 వేల చొప్పున జగనన్న చేదోడు పథకం కింద ఆర్థిక సహాయం అందించారు. వృత్తి పరంగా వారు ఆర్థికంగా కుదుట పడేందుకు ఈ నగదు ఎంతో ఉపయోగపడుతోంది. దీంతో కుల వృత్తుల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆదోని, పత్తికొండ డివిజన్లలో.

ఆదోని, పత్తికొండ డివిజన్లలోని 17 మండలాల్లో నాయీ బ్రాహ్మణులు, దర్జీలు, రజకులు మొత్తం 6,668 మందికి ఈ ఏడాది జగనన్న చేదోడు పథకం కింద లబ్ధి చేకూరింది. వీరందరికీ సోమవారం వారి ఖాతాల్లో రూ.10 వేలు చొప్పున నగదు జమ అయింది. వీరు కేవలం కుల వృత్తిని నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నారు. అయితే గత టీడీపీ ప్రభుత్వం వారిపై చిన్నచూపు చూడడం, కులవృత్తుల్లో ఆర్థిక సహాయం అందించే వారు లేకపోవడంతో జీవనం సాగించేందుకు కూడా అవస్థలు పడ్డారు. ఇలాంటి తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుల వృత్తిదారులకు అండగా నిలుస్తూ ఆర్థికపరమైన భరోసా ఇచ్చి వారికి సంవత్సరానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందిస్తుండడంతో వారి జీవితాల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

పత్తికొండలో 540 మందికి లబ్ధి

పత్తికొండ రూరల్: మండలంలోని రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లు 540 మందికి జగనన్న చేదోడు పథకం ద్వారా లబ్ధి చేకూరినట్లు ఎంపీడీఓ పార్థసారథి సోమవారం తెలిపారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం నేరుగా వారి వ్యక్తిగత ఖాతాల్లో సొమ్ము జమ చేసిందని తెలిపారు.

మద్దికెరలో 105 మందికి లబ్ధి

మద్దికెర: జగనన్న చేదోడు పథకం మూడవ విడత కింద మండంలోని ఆయా గ్రామాలలో 105 మందిని అర్హులుగా గుర్తించినట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి సోమవారం తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా లబ్ధిదారులు ఖాతాల్లో రూ.10 వేల చొప్పున జమ చేసినట్లు పేర్కొన్నారు.

వచ్చే నెల 4 వరకు రెండో విడత వెరిఫికేషన్

జగనన్న చేదోడు పథకానికి అర్హులై జాబితాలో పేర్లు లేని లబ్ధిదారులకు వచ్చే నెల 4వ తేదీ వరకు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్ల ద్వారా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అర్హులైన లబ్ధిదారులు తమ రేషన్, ఆధార్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, కుల ధ్రువీకరణ పత్రంతో పాటు లేబర్ ఆఫీస్ నుంచి పొందిన సర్టిఫికెట్‌లను సేకరించి ఆన్‌లైన్ చేస్తారు. అర్హత ఉన్న వారికి రెండో విడతలో భాగంగా ఈనెల 11వ తేదీలోపు జగనన్న చేదోడు నగదు జమ అవుతుందని అధికారులు వెల్లడించారు. అర్హులైన లబ్ధిదారులు నగదు రాలేదని ఎలాంటి ఆందోళన చెందాల్సి అవసరం లేదన్నారు.

ఇబ్బందులు తీరాయి



ప్రభుత్వం అందించే రూ.10 వేల ఆర్థిక సహాయంతో దుకాణంలో అవసరమైన వస్తువులు కొనుగోలు చేసుకోవచ్చు. ఇప్పటికే మా బార్బర్ షాపులకు ఉచిత కరెంటు అందిస్తున్నారు. దీంతో అప్పుల భారం తగ్గిపోయింది. మాకు మంచి రోజులు వచ్చి ఇబ్బందులు తీరాయి. సీఎం జగన్ సార్ మంచి ముఖ్యమంత్రిగా మాట నిలుపుకున్నారు.

– ధనుంజయ, నాయీ బ్రాహ్మణుడు, ఆలూరు

రజకులకు ఆర్థిక భరోసా ఇచ్చారు



రాష్ట్ర ప్రభుత్వం రజకులను గుర్తించడం ఎంతో సంతోషదాయకం.ఆర్థికంగా మాకు భరోసా ఇచ్చారు.సహాయం కింద అందించే రూ.10 వేలతో వృత్తికి అవసరమయ్యే వాటిని కొనుగోలు చేస్తాం. ఇలాంటి ప్రోత్సాహంతో మాలాంటి కుల వృత్తుల వారు జీవితంలో ఎదిగేందుకు ఎంతో దోహదపడుతుంది. థ్యాంకూ సీఎం సార్.

– చాకలి నాగవేణి

జాకెట్లు కుట్టే మెటీరియల్ తెచ్చుకుంటా



ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న మాలాంటి చేతివృత్తుల వారిని ఆదుకోవడం సంతోషంగా ఉంది. రోజూ జాకెట్లు కుట్టి రూ.200 సంపాదిస్తున్నాను. నా భర్త ఎలక్ట్రీషియన్. కుటుంబాన్ని నడిపేందుకు భర్తకు తోడుగా నేను టైలర్ వృత్తి చేస్తున్నాను. మూడేళ్లలో మూడోసారి చేదోడు నగదు ఇవ్వడంతో ఆర్థికంగా ఇబ్బంది తొలగింది. ఈ నగదుతో జాకెట్లు కుట్టేందుకు మెటీరియల్ తెచ్చుకుంటా.

– పుష్పావతి, టైలర్, ఆలూరు

3న ఆలూరు ఎంపీపీ ఎన్నిక

ఆలూరు రూరల్: వచ్చే నెల 3వ తేదీన ఆలూరు ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధ్యక్ష పదవికి పరోక్ష పద్ధతిన ఎన్నిక నిర్వహించనున్నట్లు మండల ఎన్నికల అధికారి శాంతన్న అన్నారు. ఆలూరు ఎంపీపీ బూర్ల సుభాషిణి (50) అనారోగ్యం కారణంగా గత ఏడాది ఆగస్టు 24న మృతి చెందడంతో ఆ స్థానం ఖాళీగా ఉంది. ఇందులో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎంపీపీ ఎన్నిక కోసం ఈ నెల 8న నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు సోమవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏఆర్వో అల్లబకాష్ సమక్షంలో మండల ఎంపీటీసీలతో ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమ నిబంధనలు, ఎన్నికల ప్రక్రియ గురించి తెలియజేశారు. మండలంలో 15 మంది ఎంపీటీసీలు ఉండగా ఆలూరు ఎంపీపీ స్థానం ఎస్సీ మహిళకు (రిజర్వ్) కేటాయించబడి ఉంది. దీంతో కమ్మరచేడు గ్రామ ఎంపీటీసీ రంగమ్మ, ఎం.కొట్టాల ఎంపీటీసీ లలితమ్మ అర్హులుగా ఉన్నారు. వీరిలో ఒకరిని మండల అధ్యక్షురాలిగా ఎంపీటీసీలు చేతులు ఎత్తే పద్ధతిలో ఎన్నుకోవాల్సి ఉంటుంది. మెజారిటీ కోరం (8 మంది) సభ్యుల నిర్ణయంతో ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవం చేసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వచ్చే నెల 3న ఉదయం 11 గంటలకు అన్ని స్థానాల ఎంపీటీసీలు హాజరుకావాలన్నారు. సమావేశంలో తాత్కాలిక ఎంపీపీ శ్రీరాములు, వైస్ ఎంపీపీ నాగవేణి వివిధ గ్రామాల ఎంపీటీసీలు హాజరయ్యారు

రిజర్వాయర్ పనుల్లో నాణ్యత పాటించండి

ఆలూరు: చిప్పగిరి మండలం నగరడోణ గ్రామ సమీపంలో ఎగువ కాలువపై రూ 53.82 కోట్లతో నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులను సోమవారం హెచ్ఎల్‌సీ ఈఈ రమణారెడ్డి, క్వాలిటీ కంట్రోలర్ ఈఈ నరసింహారెడ్డి, డీఈ మంజునాథ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెరువు కట్టకు రింగ్ బండ్, డీపీలు, ఎర్త్ బండ్ పొడవు, నీటి నిల్వ సామర్థ్యం, కట్ట ఎత్తు, కాలువల తవ్వకాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే నిధులను రికవరీ చేస్తామని కేజీటీ కంపెనీ ప్రతినిధులను హెచ్చరించారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి పనులను పూర్తి చేయాలన్నారు. డీఈ మంజునాథ్, ఏఈ తిమ్మారెడ్డి తదితరులు వెంట ఉన్నారు.

కుష్టు రహిత సమాజాన్ని స్థాపిద్దాం

ఆలూరు రూరల్: కుష్టు వ్యాధి రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని ఆలూరు కుష్టు వ్యాధి నివారణ డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ గురు ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం జాతీయ కుష్టు వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని గ్రామ/వార్డు సచివాలయాల్లో కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగాణాయన మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ అస్పత్రుల్లో కుష్టు వ్యాధికి మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామ సచివాలయాల పరిధిలో ప్రతి నెలా ఏఎన్ఎంలు, వైద్యారోగ్య సిబ్బంది కుష్టు వ్యాధి లక్షణాలున్న రోగులను గుర్తిస్తున్నారని చెప్పారు. వచ్చే నెల 13వ తేది వరకు కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు స్థానిక వార్డు సచివాలయం-2లో సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు.

ఉపాధి పనులకు పెరుగుతున్న కూలీలు

తుగ్గలి:గ్రామాల్లో ఇప్పుడిప్పుడే వ్యవసాయ పనులు పూర్తవుతున్నాయి. దీంతో రైతులు, వ్యవసాయ కూలీలు ఉపాధి పనులకు వెళుతున్నారు. సోమవారం మండలవ్యాప్తంగా 5,216 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యారు. జాబ్‌కార్డు కలిగి ఉండి దరఖాస్తు చేసుకున్న వారందరికీ పనులు కల్పించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.257 వేతనం అందుతుందని వివరిస్తూ క్షేత్రస్థాయిలో ఉపాధి సిబ్బంది కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఉపాధి పనుల కల్పనపై అవగాహన

కూలీలకు పనులు కల్పించే విషయమై స్థానిక ఉపాధి కార్యాలయంలో క్వాలిటీ కంట్రోల్ జూనియర్ గోవర్ధన్ అవగాహన కల్పించారు. పనుల గుర్తింపు, ఎన్ఎంఎంఎస్ యాప్‌లో కూలీల హాజరు నమోదు, మస్టర్ ఎలా రాయాలి అనే అంశాలపై ఆయన సిబ్బందికి అవగాహన కల్పించారు. ఏపీఓ రామకృష్ణ, ఈసీ ప్రదీప్ పాల్గొన్నారు.

మద్దికెర: వ్యవసాయ కూలీలు వలస పోకుండా ఉపాధి పనులకు హాజరయ్యేలా చూడాలని ఏపీఓ రవీంద్రనాథ్ అన్నారు. సోమవారం ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ పనులు ముగిసిన గ్రామాలలో ఇప్పటికే 1700 మంది ఉపాధి పనులకు హాజరవుతున్నారన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అన్ని గ్రామాలలో ఉపాధి పనులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు.

ముమ్మరంగా పైప్‌లైన్ ఏర్పాటు

హొళగుంద: ఎల్లార్తి గ్రామం ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి సోమవారం సర్పంచ్ కురువ చాముండేశ్వరి ఆధ్వర్యంలో పైప్‌లైన్ పనులు చేపట్టారు. తాగునీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న సర్పంచ్ వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు, ఇతర ఏ సమస్య అయినా తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామని గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దర్గన్న, ఎస్కే గిరి తదితరులు ఉన్నారు.

మూగజీవాలకు అంబులెన్స్ ఏర్పాటు హర్షణీయం



కృష్ణగిరిలో పశు ఆరోగ్య సేవ అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి: మూగజీవాల కోసం రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలందించేలా అంబులెన్స్‌లు అందుబాటులోకి తేవడం దేశచరిత్రలో సువర్ణధ్యాయమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కొనియాడారు. కృష్ణగిరి, వెల్దుర్తి మండలాలకు కేటాయించిన అంబులెన్స్ వాహనాన్ని సోమవారం ఎమ్మెల్యే శ్రీదేవి కృష్ణగిరి పశువైద్యశాలలో కోడుమూరు పశువైద్యశాల ఏడీ రామసుబ్బారెడ్డి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ 108, 104 సేవలు, ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ డాక్టర్ పథకాల ద్వారా మెరుగైన సేవలందిస్తోందని, ప్రస్తుతం మూగ జీవాల ఆరోగ్యం కోసం 108 తరహాలోనే అంబులెన్స్ ఏర్పాటు చేసి వాటి బాగోగులకు నడుం బిగించడం గర్వకారణమన్నారు. రైతులు, ప్రజలు 1962 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేస్తే సమస్య వివరిస్తే చాలు.. అంబులెన్స్‌లో రైతు ముంగిటకు వచ్చి పశు వైద్య సేవలు అందిస్తారన్నారు. అవసరమయితే పశువును దగ్గరలోని ఏరియా పశువైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం అందించి తిరిగి ఇంటికి చేర్చుతారన్నారు. ఈ అంబులెన్స్‌లో అత్యాధునిక సౌకర్యాలు, లిఫ్ట్, మినీ ప్రయోగశాల, పరీక్షలు నిర్వహించే సామగ్రితో పాటు పశువైద్యుడు, సిబ్బంది ఉంటారని వివరించారు. మండల కో-ఆప్షన్ మెంబర్ నక్కషాలు, పత్తికొండ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మాధవరావు, కృష్ణగిరి సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, పశువైద్యాధికారులు నవీన్, రమేష్, సునిల్, శాంతలత, స్వాతి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

సొంతిల్లు లేని పేదలు ఉండరాదు




మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ద్వారా స్థలం, ఇల్లు అందేలా చూడాలని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హౌసింగ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆమె స్థానిక ఎంపీపీ కార్యాలయంలో హౌసింగ్ ఈఈ నాగరాజు, ఎంపీడీఓ శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ సుంకన్నతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి సచివాలయం పరిధిలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. ఇళ్ల విషయంలో అవినీతికి పాల్పడే వారిని ఉపేక్షించేది లేదన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో పురోగతిని చూపాలని ఆదేశించారు. ఈఓఆర్డీ నరసింహులు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతిపితకు నివాళి

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి పురస్కరించుకుని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సుంకన్న, వైస్ ఎంపీపీ రంగడు, ఎంపీడీఓ శ్రీనివాసరావ్, ఈఓఆర్డీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక విద్యానికేతన్ హైస్కూల్‌లో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు హరిసింహనాయుడు, కరెస్పాండెంట్ హరినాథ్ చేతుల మీదుగా మద్యపానానికి వ్యతిరేకంగా ప్రముఖ రచయిత్రి శ్రీదేవి మురళీధర్ రచనల ఆవిష్కరణ, బుజ్జి పుస్తకాలను ఆవిష్కరించారు.

నేడు సిద్దేశ్వర స్వామి రథోత్సవం



హొళగుందలో సిద్ధమైన తేరు

హొళగుంద: చుట్టు పక్కల గ్రామాలతో పాటు ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు గ్రామాల ప్రజల ఆరాధ్య దైవమైన హొళగుంద సిద్దేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం ఘనంగా జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు రాజ పంపన్నగౌడ్ ఆధ్వర్యంలో పూర్తి చేశారు. మంగళవారం రథోత్సవం, ఫిబ్రవరి 1న లంకాదహనం, 2న వసంతోత్సవ కార్యక్రమాలతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ధర్మకర్త తెలిపారు. 1వ తేదీ స్థానిక కళాకారులచే ‘కలియుగదల్లి ఘర్జిసిద కర్ణార్జున’ ఆర్థాత్ ఒడ హుట్టిదవరు, అనే సామాజిక కన్నడ నాటకం ప్రదర్శించనున్నారు. బుధవారం జరిగే లంకాదహనం రోజు రూ.లక్షలు ఖర్చు పెట్టి వివిధ రకాల బాణసంచా కాల్చడం జరుగుతుంది. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి అన్ని వర్గాల ప్రజలు తరలి వస్తారు. చిన్నారుల కోలాటాలు, పెద్దల బల ప్రదర్శన పోటీలు ఆకర్షణగా నిలవనున్నాయి

నేడు భద్రకాళీ వీరభద్రస్వామి రథోత్సవం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని హోసూరు గ్రామంలో మంగళవారం భద్రకాళీ వీరభద్రస్వామి రథోత్సవానికి గ్రామస్తులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం రాత్రి ఎదుర్కోలు, గణారాధన, ఆయకట్టుదారులకు అన్నదానం చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో భజన చేశారు. మంగళవారం 9:25 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, సాయంత్రం 5 గంటలకు రథోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. బుధవారం రాత్రి 9 గంటలకు ప్రభోత్సవం, గురువారం వసంతోత్సవంతో వేడుకలు ముగుస్తాయి.

‘స్పందన’ అర్జీలు పరిష్కరించండి

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ కృష్ణమూర్తి ఆదేశించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్పందన ద్వారా అందించిన అర్జీలకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి, సీహెచ్ఓ బలరాం, ఏఓ మద్రి శ్రావంతి, ఏపీఎం చిన్నవీరన్న, తదితరులు పాల్గొన్నారు.

చిప్పగిరి: స్పందనలో ప్రజలు సమర్పించిన అర్జీలు పరిశీలించి సత్వరమే పరిష్కారానికి చర్యలు చేపడతామని తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందనలో కుందనగుర్తి గ్రామానికి చెందిన పురుషోత్తం తమ గ్రామానికి రోడ్డు వేయాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చారన్నారు. పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామన్నారు. సూపరింటెండెంట్ సుధాకర్ రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాంనీలా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసూన, ఏపీఎం నాగార్జున, ఏఓ ఆనంద్, ఈఓపీఆర్డీ సంజన్న, ఎంఈఓ మస్తాన్‌రావు పాల్గొన్నారు.

ఫార్మసిస్ట్‌పై చర్యలు తీసుకోవాలి

హొళగుంద: స్థానిక పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఫార్మసిస్ట్ నాగన్న గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు ఈశా, అగ్రికల్చర్ అడ్వైజర్ బోర్డు చైర్మన్ మల్లికార్జున తదితరులు డిమాండ్ చేశారు. సోమవారం పీహెచ్‌సీలో రోగులకు మందులు ఇచ్చేవారు లేరనే విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న నాయకులు డాక్టర్ రాధతో మాట్లాడారు. ఫార్మసిస్ట్‌ను ఫోన్‌లో సంప్రదించగా.. తాను లీవ్ లేటర్ పెట్టానని చెప్పానే, బంధువులు ఒకరు చనిపోతే ఆస్పత్రిలో సిబ్బందికి చెప్పి వెళిపోయినట్లు చెప్పడంతో నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్మసిస్ట్ తీరుపై ఫోన్ ద్వారా డీఎంహెచ్ఓ రామగిడ్డయ్యకు ఫిర్యాదు చేశారు. నాయకులు హనుమప్ప, మల్లయ్య, కరెంట్ లక్ష్మన్న ఉన్నారు.

➡ పీహెచ్‌సీలో ప్రతి చిన్న విషయానికి ఫార్మసిస్ట్ గొడవ పడ్తున్నాడని తాను ఇక్కడ పనిచేయలేక పోతున్నానని డాక్టర్ రాధ వైఎస్సార్‌సీపీ నాయకుల ముందు గోడు వెళ్లబోసుకుంది. ఫార్మసిస్ట్ పరిధి దాటి వ్యవహరిస్తున్నాడని వాపోయింది.

➡ హొళగుంద పీహెచ్‌సీలో రోగులకు వైద్యం సక్రమంగా అందడం లేదని వెంటనే జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ఓ చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యుడు పెద్యాగ శ్రీరంగ, మండల కార్యదర్శి సతీష్‌కుమార్ సోమవారం స్పందనలో తహసీల్దారు హుసేన్‌సాహెబ్‌కు ఫిర్యాదు చేశారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు



వాటర్ ప్లాంట్ల నిర్వాహకులతో మాట్లాడుతున్న కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు: వాటర్ ప్లాంట్ల నిర్వాహణలో నిబంధనలు పాటించని వారిపై తగిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జి.గంగిరెడ్డి హెచ్చరించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వాటర్‌ప్లాంట్ నిర్వాహకులతో అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం జనవరి 26 నుంచి ప్లాస్టిక్ వినియోగం రద్దు చేసిందని, అందుకు తగ్గ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రతి వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు బీఎస్‌ఏ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, ఏఎస్ఐ ప్రమాణాలుతో కూడిన బాటిళ్లను వినియోగించాలన్నారు. ప్లాంట్ నుంచి సరఫరా చేసే ప్రతి క్యాన్‌పై బ్యాచ్ నంబర్, తయారీ తేదీ, ఎక్స్‌పైరీ తేదీలు ఉండాలన్నారు. మూడురోజుల్లో కొత్త వాటర్ క్యాన్లతో నీటిని సరఫరా చేయాలని, ట్రేడ్‌లైసెన్స్ లేకుండా విక్రయాలు జరపరాదన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ఎవ్వరూ ప్లాస్టిక్ వాటర్ ప్యాకెట్లను తయారు చేయడం, పంపిణీ చేయడం చేయరాదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవటంతోపాటు ప్లాంట్లను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి పీఎల్ వరలక్ష్మి

వెల్దుర్తి: రైతులు చిరుధాన్యాల సాగు వైపు మొగ్గు చూపాలని, తక్కువ కాలంలో దిగుబడులు చేతికి రావడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న గిట్టుబాటు ధరతో లాభాలు ఆర్జించవచ్చని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పీఎల్ వరలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం పురస్కరించుకుని జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా సోమవారం స్థానిక ఆర్బీకేలో ఏఓ అక్బర్‌బాష ఆధ్వర్యంలో రైతులు, ప్రజలకు అవగాహన కల్పించారు. అంతకుముందు విద్యార్థులచే చిరుధాన్యాల ఆవశ్యకతను తెలిపే ఫ్లకార్డుల ర్యాలీ ఆకట్టుకుంది. ఆర్బీకేలో జరిగిన అవగాహన కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ చిరుధాన్యాలు (నవధాన్యాలు) అయిన జొన్న, సజ్జ, రాగులు, కొర్రలు, సామలు, అరికలు, ఊదలు, అండుకొర్రలు సాగు చేయాలని రైతులకు సూచించారు. చిరుధాన్యాలు తినడం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, వాటి ఆవశ్యకతను వివరించారు. చిరుధాన్యాల వంటకాల స్టాల్, చిరుధాన్యాలను సూచిస్తూ ఏర్పాటు చేసిన ఆహార చక్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కర్నూలు డాట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రసాద్, గుంటూరు వ్యవసాయ కమిషన్ రాష్ట్ర కార్యాలయ వ్యవసాయాధికారి విశ్వేశ్వరప్ప, జిల్లా వ్యవసాయ సలహా మండలి పట్టు పరిశ్రమ సభ్యుడు సమీర్‌రెడ్డి, ఏడీఏలు విజయ్‌కుమార్, బాలవర్ధి రాజు, డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ తదితరులు పాల్గొన్నారు.